# వాకింగ్ హాస్పిటల్

## మాలతీ చందూర్

'అమ్మా.... అబ్బా....' కాళ్ళు దడదడ లాడుతూ వున్నాయి. 'అబ్బా' చేతులు పీకుతున్నాయి.

తల తిరుగుతూ వుంది గొంతులో వుండ పెట్టినట్టుగా వుంది. విల్చునే శక్తి లేక మంచం మీద పడింది సరస్వతి.

"అమ్మ ఏది?" అని అడుగుతూ "ఏవోయ్ స్నానం అయిపోయింది టిఫిన్ పెట్టేశావా?" తల దువ్వుకుంటూ కేక వేశాడు సరస్వతి భర్త రామారావు.

"ఎక్కడా? మీ మమ్మీ ఏది? చూడు బేబీ. మమ్మీని టిఫిన్ పెట్టమని చెప్పు ప్లేట్లు సర్దావా?" అడుగుతూ వున్నాడు కూతుర్ని.

బెడ్‌రూమ్‌లో మంచం మీద వున్న సరస్వతికి యీ మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి. జవాబు చెప్పే వోపిక లేదు. కళ్ళు మండుతున్నాయి. కడుపులో రొమ్ము కిందుగా పోట్లు.

"బాబీ-మీ మమ్మీ ఏదిరా? చూడు డాబామీదకి వెళ్ళిందేమో." కొడుకుని పిల్చి అడుగుతున్నాడు.

సరస్వతికి కోపంగా వుంది. గాబరాగా కూడా వుంది. ఇంట్లో మనిషి ఎక్కడుందో కూడా తెలుసుకోలేని బుద్ధిమంతులు తామేదో పెద్ద పాలెస్‌లో వున్నట్లు? లోపలి కొచ్చి చూడకూడదా? మనసులో గింజుకుంటున్నది.

"ఏవిటోయ్ పడుకున్నావ్?" బీరువా లోంచి బట్టలు తీసుకోటానికి వచ్చిన రామారావు అడిగాడు.



సరస్వతి జవాబు చెప్పలేదు "తల వగిలిపోతోంది. కడుపులో నెప్పి. కాళ్ళు పీకుతున్నాయి. ఇంత యాతన పడుతుంటే ఎందుకు పడుకున్నావని అడుగుతాడేం!"

"ఒంట్లో బాగా లేదా?" ఆదుర్దాగా మీదకు వంగి నుదురు పట్టుకుచూశాడు.

"కాస్త వెచ్చగా వున్నట్లుంది పడుకో మేము పెట్టుకు తింటాంలే.... డాక్టర్‌కి ఫోన్ చెయ్యనా? ఆఫీసుకి శలవు పెట్టనా?"





గబ గబ అడుగుతున్నాడు.

సరస్వతికి కాస్త తృప్తిగా వుంది అయిదు నిముషాల క్రిందట వున్న అసంతృప్తి కొంచెం తగ్గింది.

"ఏం లేదు— కాస్త భారంగా వుంది." అనే లేవబోయి కూచోలేక, తూలిపడి పోయింది పక్కమీద.

"నువ్వు లేవకు పడుకో. కళ్ళు మూసుకు పడుకో. టిఫిన్ పెట్టుకు తింటాంలే" అని, మంచంమీంచి లేవబోతూ భార్య వణకటం గమనించి "ఏమిటి? ఎందుకు అలా వణుకుతున్నావ్?" అని అడిగాడు రామారావు ఖంగారుపడుతూ.

"చలి-చలిగావుంది". అంది సరస్వతి పళ్ళు కొరుక్కుంటూ. అతను కాళ్ళ వైపునున్న శాలువ కప్పాడు. కాస్త చలి తగ్గినట్లయి ముణగ తీసుకు పడుకుంది. డైనింగ్ హాల్లోంచి ప్లేట్లు చప్పుడు. పిల్లలిద్దరూ, భర్తా టిఫిన్ తింటున్నట్లున్నారు.

కళ్ళు మూసుకు పడుకుంది. కడుపులో సన్నగా పోట్లు. కడుపులో కాదు. కుడి వైపు రొమ్ము కిందుగా నొప్పి. గుండెలు పట్టుకున్నట్లు. నెప్పి కళ్ళు మూసుకొన్నది. సన్నగా పొడుస్తున్నట్లు నెప్పి- మధ్య మధ్య టిఫిన్ తింటున్న పిల్లల గొంతు. భర్త మాటలు.

తనకి గుండె నొప్పి వస్తుందా? గుండె ఏ పక్కనుంటుంది? అదిగో మళ్ళీ నెప్పి వస్తోంది. గుండెపోటు యిల్లాగే వుంటుంది కాబోలు. చమటలు కూడా పడుతున్నాయి నిజంగా గుండెనొప్పేనా? ఏదో గాభరాగా వీపులోంచి ముందుకు నెప్పి • పొడుచుకొస్తున్నది. ఈ మధ్య నాలుగైదు రోజులుగా నొప్పివస్తుంటే తను అశ్రద్ధ చేసింది. ఇది గుండె నొప్పి సందేహం లేదు భర్తని పిలిచి చెప్పాలి. "నాకు భయంగా వుంది గుండెలు పట్టుకున్నాయి హాస్పిటల్‌లో చేర్పించండీ" అని గొంతులోంచి మాట రావడం లేదు.

ఇలా పోటు వొచ్చి వొచ్చి గుండె ఆగిపోతే ఉహూ. అలా ఆగితే కార్డియాక్ అరెస్ట్ అవుతుంది. తన నవలలోని హీరో సుధాకర్- బొమ్మలు వేసే సుధాకర్ కార్డియాక్ అరెస్ట్‌తో చచ్చిపోయాడు. ఒక్కే ఒక పోటువచ్చి పోయాడు. కార్డియాక్ అరెస్ట్ అయితే యిలా మధ్య మధ్య చిన్న చిన్న నెప్పిరాదుట. ఇది హార్ట్ ఎటాక్ అయివుంటుంది.

ఆ రమామణి జేరిన దానికంటే మంచి నర్సింగ్‌హోమ్‌లో చేరాలి. డబ్బుకి వెనకాడకూడదు. రమామణి ఏం చేసింది? తనకి హార్ట్ ఎన్‌లార్జ్ మెంట్—అందరికీ పోస్టుకార్డులు రాసి పడేసింది. ఆరువారాలు ఎ.సి రూమ్‌లో బైఠాయించింది. వెర్రి వాళ్ళు ఆవిడగారి పబ్లిషర్సూ, ఎడిటర్సూ వారానికి ఒకళ్ళు చొప్పున తీర్థప్రజల్లా వచ్చి అమ్మగారి దర్శనం చేసుకున్నారు. వచ్చిన వాళ్ళు వుత్త చేతుల్తో వచ్చారా! చెక్‌లు, పువ్వులు, గెట్ వెల్ కార్డ్సు....

'అబ్బా....నెప్పి...వీపులోంచి పోటు.'

'ఏమండీ?' సన్నగా పిలవబోయింది శబ్దం బయటకి రాలేదు. పళ్ళు కరుచుకుంటున్నాయి. కిరకిర శబ్దం ఎక్కడి నుంచో వస్తోంది. ఎక్కడి నుంచి? తన నోట్లోంచా? పట్టు బలవంతాన కదలకుండా పళ్ళు బిగించుకుంది.


హార్ట్ ఎన్‌లార్జ్‌మెంటు-యీ మధ్యన కామన్ అయిపోయింది. వెధవది-ఎక్స్‌రే కంటే చవకయిపోయింది ఇ.సి.జి. ఉహూ తనకి అంతకంటే సీరియస్ కంప్లయింటే అయివుంటుంది. పదిరోజులుగా ఆయాసంగా, అలసటగా వుంటోంది. ఇలా వుంటేనే కదూ.... ఆ యన్.టి. రామారావుకి బైపాస్ సర్జరీ చెయ్యాలన్నది. తనకీ అదే అయివుంటుంది ఎప్పుడూ లేనిది రాస్తుంటే కూడా ఆయాసం వస్తోందీమధ్య. రోజుకి వంద పేజీలు రాసే తను పదికాయితాలు కూడా రాయలేకుండా వుంది. బహుశా తనకి కూడా కారోనరి బైపాస్ సర్జరీ అవసరం అయే వుంటుంది. తప్పదా?

ఆ సర్జరీకి పాతికవేలవుతుందిట మన దేశంలో అయితే? పాపం! ఆయన ఎక్కడినుంచి తెస్తారు? ఏం? ఎందుకు తేలేరు! తన ఆరోగ్యం బాగుపడితే పాతిక వేలేం ఖర్మ— పదిలక్షలు సంపాయిస్తుంది హాయిగా ఎన్ని నవలలేనా రాస్తుంది వారానికి ఒక నవల తేలిగ్గా రాసి పారేస్తుంది.

తను రమామణిలాగా దొక్కు నర్సింగ్ హోమ్‌లో చేరదు. పైగా ఆ నర్సింగ్‌హోమ్‌లో బైపాస్ సర్జరీలో యిద్దరు గుటుక్కుమన్నారుట. ఉహూ పాష్ నర్సింగ్ హోమ్‌లో చేరుతుంది. ఈ మధ్యపెట్టారు. తన ఫ్రెండుని చూడటానికి వెళ్ళింది. లిఫ్టులు, ఎ.సి.సూట్సు. పుస్తకాలషాపు. పూల గుత్తుల షాపు ఫైవ్‌స్టారు హోటల్ లాగా వుంది. జబ్బు చేస్తే అల్లాంటి చోటు వుండగలగాలి అంతేగాని వూరుకి చివరన ఎ.సి అయితేనేంగానీ, రమామణి జేరిన ఆ మిడిల్ క్లాస్ నర్సింగ్ హోమ్‌లో తను చేరదు.

"సరూ, సరూ ఎలా వుంది? ఆఫీసుకి లీవు పెట్టనా?" పక్కన కూచుని అడుగుతున్నాడు భర్త. అతని దగ్గర సాంబారు వాసన. సరస్వతికి భళ్ళున దోకు వచ్చినట్లు అయింది. తను లక్షసార్లు చెప్పింది వుల్లిపాయ సాంబారు చేసిన రోజున సోపుతో చేతులు కడుక్కోమని....ఉహూ ఎడ్డిమనిషి ఎంత చెప్పినా యింతే....

"ఇడ్లీ సాంబారూ ఫస్టు క్లాసుగా వున్నాయి. పావం నువ్వు తినలేదా. కాఫీ



నీలాకాశ ఫాలతలాన వేలే జ్వాలా తోరణం

—ఫోటో: ఎం.వి.యస్., మద్దిపాడు

పెట్టివ్వనా ?"

"వొద్దండి" అంది నూతిలోంచి లాగా.

"ఆఫీసుకి వెళ్ళనా ?" అడిగాడు.

"వెళ్ళండి. వచ్చేప్పటికి గుండెకి నెత్తురు అందక చచ్చి వూరుకుంటాను. అప్పుడు నా మీద పడి ఏడుద్దురుగాని !" మనసులోని భావాల్ని పైకి అనలేకుండా వుంది.

"అర్జంటు పనుంది.వస్తూ డాక్టరుగార్ని వెంటపెట్టు కొస్తాను."

"వద్దు. పిల్లల్ని తీసుకువెళ్ళిపొండి. తలుపులు వేసుకు విశ్రాంతిగా పడుకుంటాను" ఈ వణుకుతూవున్న కంఠం తనదేనా? అదేమిటి తన శరీరం ఎందుకు అలా వణుకుతుంది ?

"ఇందాకటి కంటె వేడిగా వుందే. అరె! జ్వరం ఎక్కువయినట్లుంది. టెంపరేచరు చూడనా ?" అడిగాడు రామారావు.

"వొద్దు. ఆనక చూస్తాను.ధర్మామీటరు యీ పక్కనుంచి వెళ్ళండి" అంది సరస్వతి. మళ్ళీ చలి.

రామారావు వెళ్ళేందుకు రడీ అవుతున్నారు! పుస్తకాలు సర్దుకుని పిల్లలు 'డాడీ' అంటూ పిలుస్తున్నారు డైనింగ్ హాల్లోంచి.

ఏం పిల్లలు ? ఏం భర్త ? వీళ్ళకి తన చాకిరీ కావాలి. తన పేరు కావాలి. డబ్బు కావాలి. బ్రతికిందో చచ్చిందో అక్కర్లేదు. వీళ్ళని ఎంత ప్రేమగా పెంచింది. వాళ్ళు వెచ్చబడితే గిలగిల్లాడిపోయేది. రోజూ వండి వర్చి. హోమ్ వర్కు చేయించి. బట్టలు యిస్త్రీ చేసి.... ఛీ ఛీ. ఆడదాని జీవితాని ఇంత కంటె విలువ లేదు కదా ! ఎంత పేరుండి ఏం లాభం ?

బైపాస్‌కి ముందు ఆంజియోగ్రామ్ చేస్తారు కదూ ? అసలు ఆ రెండు రోజుల్లోనే తెలిసి పోతుంది తన విలువ ! నర్సింగ్ హోమ్‌లో పడుకుని టి. వి. చూడొచ్చుట. అసలు హార్ట్ పేషంట్లుకి టి. వి. చాలా ముఖ్యంట. తను ఎ. సి. రూములోనే వుంటుంది.చూడటానికి వచ్చే పాన్సు. విజిటర్సు వాళ్ళ దృష్టిలో తను పైమెట్టు మీద హోదాలో వుండాలి తప్ప చచ్చు నర్సింగ్‌హోమ్‌లో వుండకూడదు. పేరూ ప్రతిష్టా వున్న తన వంటి రచయిత్రి ఫలానా సరస్వతీ రామారావు మా

# ఎర్రజీర

ఈ సంఘంలో వ్యక్తులు
వారి వ్యక్తిగత కక్షలు చూసి॰
చూసి॰
నాలో రగిలే కోసాగ్నికి॰
ప్రతిరూపమే ఈ నా ఆవేశం!
అది నా కన్నుల్లో ప్రజ్వరిల్లి
ఎర్రజీరల్ని చూపిస్తుంటే
దాన్ని చూసిన వెర్రిజనం
నన్నే ఓ వెర్రి వాడ్నంటున్నా
లెక్కచేయక॰ నాకు నేనే
వీపు తట్టుకుని॰ నిర్భయంగా
ఆ ఎర్ర జీరల్నీ
ఆ ఆవేశాన్నీ
తగ్గిపోకుండా చూసుకుంటూ
అలాగే బ్రతుకుతున్నాను!
ఎప్పుడైనా వాటి అవసరముందని
అవే నాకు అండదండలవుతాయని!!

—లక్ష్మి

మూలు నర్సింగ్‌హోమ్‌లో వుంటే ఎంత అవమానం ! బుక్ ట్రేడ్‌లో తన విలువ పడిపోతుంది. ఈ నర్సింగ్‌హోమ్ స్టయిల్ చూసి పబ్లిషర్స్ దంగైపోతారు.

బైపాస్ సర్జరీ అయ్యాక నాలుగు నెలలు రెస్టు తీసుకోవాలిట. అమ్మ బాబోయ్ నాలుగు నెలలే ! తను నాలుగు నెలలు వుండదా. యన్ టి. ఆర్ వున్నాడేమిటి ? నాలుగు వారాల్లో లేచి తిరగలేదా ? పొలిటీషియన్సుకి. హార్ట్ పేషంట్లకి యన్. టి. ఆర్. కొత్త వరవడి పెట్టలేదా ? తనూ అంతే. రైటర్సుకి కొత్త మార్గం చూపిస్తుంది. పక్కమీద పడుకునే నవలలు రాస్తుంది వారానికి ఒక కొత్త నవల పూర్తి చేస్తుంది. మానసిక శక్తి ఎంత వున్నతమైనదో చేసి చూపుతుంది. క్రియేటివ్ ఎబిలిటీకి ఆకాశం ఒక్కటే లిమిట్ అని నిరూపిస్తుంది.

"అబ్బా.... అమ్మా చలి- కడుపులో నొప్పి" పొద్దుట నుంచి వీపులోంచి ముందుకు పొడుస్తున్న పోట్లు కిందకొచ్చాయి. కడుపులో నొప్పి. చెయ్యి ఇటూ అటూ ఆడించి చూసింది కుడిచేయి గూడలోంచి వస్తున్న పోట్లు తగ్గినాయి. ఇప్పుడు కడుపులోంచి పోట్లు.అరిచేతులు పొడిపొడిగా అవుతున్నాయి. మోకాళ్ళ కిందనుంచి పిక్కలు లాగుతున్నాయి. గొంతులో వుండపెట్టినట్లు బాధ. ఎండిపోతున్న నాలికతో పెదాలమీద రాసుకుని నోట్లోంచి లాలాజలం తెచ్చుకోవాలని ప్రయత్నించింది. ఉహూ. నాలిక పొడిగా వుంది- తడి రావటం లేదు

కొంపతీసి తనకి డీ-హైడ్రేషన్ రావడం లేదు కదా ! ఏమో — ఎవరు చూశారు ? పొద్దుట నుంచి గుక్కెడు నీళ్ళు తాగలేదు. బాడీలోని ఫ్లూయిడ్స్ ఆవిరి అయిపోయ్యాయేమో ! అలా అవుతుందా ? కొత్త కొత్త జబ్బులు ఎన్ని రావడం లేదు! ఎనిమిది గంటల్లో బాడీ ఫ్లూయిడ్స్ కరిగిపోయి డీ-హైడ్రేషన్ కలిగే కొత్త రకం వ్యాధి తనకి వచ్చిందేమో !

నర్సింగ్‌హోమ్‌లో చేర్చి తనకి సెలైన్ ఎక్కిస్తారా ? "ఇంటెన్సివ్"లో కూడా పెడ్తారేమో ! పెట్టొచ్చు. ఇప్పుడే ఇలా డీ-హైడ్రేట్ అయితే సాయంత్రం పిల్లలూ మొగుడూ వచ్చేటప్పటికి తన నాలిక పిడచ కట్టుకుపోయి పళ్ళ మధ్య యిరుక్కుపోయిన నాలిక యిరుక్కుపోయి భయంకరంగా తయారవుతుందా ? అవచ్చు. ఎనిమిది గంటల్లో డిహైడ్రేట్ అయిన తన శరీరతత్వం గురించి పరిశోధనలు- డాక్టర్లు- ఒక వేవ్- సృష్టిస్తుంది. పెద్ద సంచలనం ఏర్పడుతుంది. 'ఇంటెన్సివ్'లో గాజు కిటికీ వెనక తను నీరసంగా. నిస్సహాయంగా చూస్తుంటే బయట ఆయనా. పిల్లలూ బెంగగా పిరికిగా తన వంక చూస్తుంటారా!

తనకి నయమయ్యాక నర్సింగ్‌హోమ్ నుంచి బయట పడీపడగానే వెంటనే తన స్వానుభవాన్ని యధాతధంగా ఒక్క విషయం వదిలిపోకుండా రాస్తుంది. పాఠకులు వెర్రిగా చదువుతారు. సానుభూతి కూడా వుంటుంది. యన్. టి. ఆర్.ని ఆదరించినట్లు తనని కూడా పాఠకులు "అయ్యో! నీకు ఎంత కష్టం వచ్చిందే తల్లీ" అని తన చెంపలు రాసి. దిష్టితీసి.

మెటికలు విరుస్తారు. జబ్బుపడితే తప్ప మనిషి విలువ తెలియదు అసలు ప్రేమలు బయట పడాలంటే జబ్బు పడాలి.

గాయిలాగా, చిరుగున చీర కండా ఆరోగ్యంగా వుంటే ఇంట్లో ఎవరికీ లక్ష్యం వుంటం లేదు. ఇంట్లో ఏమిటి? పాఠకుల్లో కూడాను. 'ఈ సినిమా తారకి కామెర్లు వచ్చాయి. ఆ రచయిత్రికి ఆపరేషను చేశారు' అని వార్తల్లో వచ్చినప్పుడు వాళ్ళ పాప్యులారిటీ కూడా పెరుగుతూ వుంటుంది.

"అబ్బా.... చలి.... కాళ్ళు లాగుతున్నాయి. తలదిమ్ము. అరిచేతులు, అరికాళ్ళు పొడిగా ఎండు అకుల్లా వున్నాయి. చెమట పట్టదేం. కడుపులో పోట్లు."

టెంపరేచర్ చూసుకుంది. థర్మామీటరు పగిలిపోతుందేమోనన్నంత భయం వేసింది. పాదరసం పాములా జరజరాపాకి అయిదు దగ్గర ఆగింది. అమ్మో! నూటయిదు జ్వరమే. బాబోయ్ ఇది గుండె జబ్బు కాదు. గుండె అయితే జ్వరం రాదు. చాపకింద తేలులాగా చల్లగా గుండె ఆగిపోతుంది తప్ప! జ్వరం వుండదు. వణుకుతున్న చేత్తో పక్క టేబుల్ మీద వున్న మంచినీళ్ళు తీసుకుని గొంతులో పోసుకో పోయింది. నీళ్ళగ్లాసు పక్కనే క్రోసిన్ మాత్రపెట్టి వెళ్ళాడు. పొద్దుట మొగుడు. 'అది వేసుకో!' జ్వరం తగ్గుతుందని. వణికే వేళ్ళతో కాయితం చించింది. అతి కష్టంతో గొంతులో మాత్ర వేసుకు నీళ్ళు తాగబోయింది. గుటకపడ లేదు. భళ్ళున నీళ్ళతోపాటు మాత్ర నేల మీద పడిపోయింది.

సరస్వతికి ఏడుపొచ్చింది. మింగుడు




పడటం లేదు. ఆఖరికి నీళ్ళు కూడా తాగలేకుండా వుంది. నూటఅయిదు జ్వరం వుంది. ఇంత జ్వరం దేనికొస్తుందో తనకి తెలుసు. కాన్సర్ అయితేనే ఇంత హై టెంపరేచరు వస్తుంది. గొంతు మింగుడు పడకపోవడం. ఇంత జ్వరం అయితే తప్పకుండా గొంతు కాన్సర్! సందేహం లేదు. తను చచ్చినా కాన్సరుకి ట్రీట్ తీసుకోదు. ఆ కోబాల్ట్—రేడియం.... బాబోయ్ మనిషిని ఆర్చేస్తాయి. జుట్టు వూడిపోతుందట. దేహంలో చీమూ నెత్తురూని పీల్చుకుని పోతుందట ఆ వేడి. ఉహూ; తను ఎంత బాధనైనా భరిస్తుంది కాని ఆ వెధవ ట్రీట్ మెంటు తీసుకోదు. నరకయాతన పడితే- మూడేళ్ళు అయిదేళ్ళు- అంతకి మించి జీవితకాలం పెరగదట. దాని కోసం- యీ శ్రమ, డబ్బు ఖర్చు దేనికి?

కాన్సర్ అంటే తనకి భయం లేదు. చాలా కామ్ గా తీసుకుంటుంది. ఇంట్లో వాళ్ళని కూడా భయపెట్టదు. కానున్నది కాకమానదు. ఫేట్ - కర్మ- అన్నవి యీ జీవితానికంటే శక్తివంతమైంది. ఆ కర్మ సిద్ధాంతాన్ని నమ్మటమే మన కర్తవ్యం అని బోధిస్తుంది. ఇలా గదిలో పక్క పడుకుని కాన్సర్ వ్యాధి గ్రస్తులకి ధైర్యమూ శక్తినిచ్చే రచనలు చేస్తుంది. ఆత్మశక్తి వుంటే ఎటువంటి వ్యాధినైనా జయించవచ్చునన్న సందేశాన్ని యిచ్చే రచనలు చేస్తుంది.


తనకి కాన్సరు. సందేహం లేదు. అందుకే నూటయిదు డిగ్రీల జ్వరంవచ్చేసింది. తను లేకుండా బ్రతకగలగటం పిల్లలకు ఇప్పటినుంచేనేర్పుతుంది. భర్తకి కూడాను. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటే, చేసుకోమనే చెపుతుంది. తన నవలలన్నీ, రచనలన్నీ ఒక ట్రస్టుగా ఏర్పరచి వాటి మీద వచ్చే డబ్బు కాన్సరు వ్యాధి నిర్మూలనకి దానం చెయ్యమంటుంది వూరూరా ప్రతి పట్నంలో కాన్సరు సఫరర్స్ ఎసోసియేషన్ స్థాపించాలి. అసలు తను బ్రతికివుండగానే ఈ ఉద్యమానికి పునాది రాళ్ళు వేస్తుంది....

డోర్ బెల్ గీరగా అరుస్తున్న శబ్దం. సరస్వతి పక్కమీంచి లేవలేకుండా వుంది. ఒకటే చలి. కాళ్ళూ, చేతులూ కొంకర్లు పోతున్నట్లు చలి. శరీరంలోంచి ఆవిర్లు.

మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కిన శబ్దం.






కీచుగా అరుస్తోంది బెల్.

మంచం మీంచి మెల్లిగా లేచి తూలి పోతున్న శరీరాన్ని అదుపుకు తెచ్చుకుని గోడ పట్టుకు వెళ్ళి తలుపు తీసి కళ్ళు తిరిగి పడిపోయింది సరస్వతి.

గుమ్మంలో రామారావు. "అరె! అదేమిటి. ఏమిటయింది?" అంటూ భార్యని చేతుల్లోకి ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టి శాలువా కప్పాడు. చలితో ఎగిరెగిరి పడుతోంది. పైన మరో దుప్పటి కప్పి పీపుని అనుకుని పక్కన కూర్చు న్నాడు. నేల మీద నీళ్ళ మడుగు మధ్య తెల్లని మాత్ర చూసి:

"సరూ, టాబ్లెటు వేసుకోలేదా?" అడి గాను

లేదన్నట్లు తల వూపింది. కళ్ళు విప్ప లేనంత జ్వరంగా వుంది. వేడివేడిగా ఆవిర్లు వస్తున్నాయి. దుప్పటి కింద మంటలు పెడుతున్నట్లుగా వుంది. మళ్ళీ అంతలోనే చలీ.

"ఆఫీసులో కూర్చున్నానేగాని ఏవిటో కంగారు. రెండు సార్లు ఫోన్ చేశాను."

వినిపించలేదన్నట్లు సౌంజ్ఞ చేసింది.

"ఉండు. ముందు డాక్టరుగారికి ఫోన్ చేస్తాను."

సరస్వతి చేతితో అడ్డు పెడదామని ప్రయత్నించింది. శాలువ కిందనించి చెయ్యి బలవంతాన బయటకి తీసేప్పటికి ఆర్త నెంబరు తిప్పడం అయిపోయింది.

అసలు డాక్టరెందుకు? ఎవరూ చెప్ప క్కర్లేదు. తన తెలుసు. ఇది థ్రోట్ కాన్సరని! దీనికి డాక్టర్లెందుకు. అనవస రపు ఖర్చు. వద్దు అని చెపుదామని అను కుని పైకి అనలేకపోయింది.

అరగంటలో డాక్టరొచ్చాడు. వస్తూనే "ఏమిటి? మిసెస్ రావు పడుకున్నారే?" హడావుడిగా అడిగాడు.

ఈ డాక్టరంటె సరస్వతికి కాస్త విసుగు. ప్రతిదీ తేలిగ్గా నవ్వులాటగా తీసుకుంటాడు.

"టెంపరేచర్ చూశారా?" అడిగాడు పల్స్ చూసి.

"ఆ" అంది సరస్వతి వినీ వినపడ నట్లు.

"ఎంతుంది?"

"నూటఅయిదు" అంది నెమ్మదిగా.

రామారావు తేలుకుట్టినట్లు "నూట అయిదా?" అన్నాడు కాస్త గట్టిగానే.

"ఉండండి. కంగారేం లేదు. అంత వున్నట్లు లేదే" అంటూ తన బ్యాగులోని థర్మామీటరు తీసి నోట్లో పెట్టి స్టెత్ స్కోప్ బయటకి తీశాడు.

సరస్వతి కాస్త ధైర్యంగా వుంది. స్టెత్‌స్కోపులో తప్పకుండా తెలుస్తుంది. లంగ్స్ క్లియరుగా వున్నాయని- ఇక మిగి లింది....

నోట్లోంచి థర్మామీటరు తీసి "నూట రెండే వుందే.... చెమట పట్టిందా?" అడిగాడు.

"లేదండి" అంది నూతిలోంచి లాగా.

"ఏం- ఆ ... థర్మామీటరు. పోనీ— దాంతో చూస్తాను...." విసురుగా బలం కొద్దీ విదిలించాడు. పాదరసం 'దిగిరాను దిగిరాను' అంటూ పంచమ సంఖ్యనివదలి కిందకి రాలేదు.

సరస్వతికి నిజంగానే చెమటలు పట్టే స్తున్నాయి. "చెమట పోస్తున్నది" అంటూ శాలువ తీసేసింది.

"నీళ్ళు కాచుకు తాగుతున్నరా?"

సరస్వతి విననట్లు వూరుకుంది.

"మిసెస్ రావ్. మీరు చదువుకున్న వారు. నలుగురికి చెప్పగలిగిన వారు. మీరే ఇలా చేస్తే ఎట్లా? వూళ్ళో మలే రియా-ఫ్లూ ఎక్కడ బడితే అక్కడ! ఇంటికొక మంచం. అయ్ సస్పెక్ట్ మలే రియా!" వడగళ్ళవానలా చెప్పుకు పోతు న్నాడు.

సరస్వతి కళ్ళు తెరవలేదు. ఏదో కసి, కోపం. తనకేదో అన్యాయం జరిగి పోయింది. అందరికీ వచ్చే దిక్కు మాలిన మలేరియా తనకి వచ్చిందా. ఛీ ఛీ....

"కడుపులో పోట్లు" అంది సన్నగా.

"అయితే ఫ్లూ అయివుంటుంది. వాటరు కంటామినేషనండీ బాబూ. ఎందుకయినా మంచిది నీళ్ళు కాచి తాగండి. ఈ టాబ్లెట్స్ వేసుకోండి. సాయంత్రానికి టెంపరేచర్ తగ్గకపోతే రేపు బ్లడ్ టెస్ట్ చేద్దాం."

"ఎవరికి? మీకా, నాకా?" అడగాలని అనిపించికూడా అడగలేకపోయింది.

"మనకి సగం జబ్బులు ఈ నీళ్ళవల్ల వస్తున్నాయి. వాటర్ యీజ్ ది మైన్ కల్‌ప్రిట్"

"ఏం డైట్ యిమ్మన్నారు?" అడిగాడు రామ రావు.

"ఏది కావాలంటే అది పెట్టండి. అన్నం తినాలని వుందా- నయిస్తే తినే య్యండి."

"గొంతు నొప్పిగా వుంది" అంది సరస్వతి.

"అయితే ఇది ఖచ్చితంగా ఫ్లూయే. ఏది- నాలిక చూపండి. ఫ్లూయే సందేహం లేదు సాయంత్రానికి అంతా తగ్గిపోతుంది. అన్నట్లు మిసెస్ రావ్ ఈ మధ్య కొత్త నవల్స్ రాశారా?" చేతులూ కడుక్కుంటూ అడిగాడు.

"నీ శ్రాద్ధం రాశాను" అందామను కుంది కాని, అనలేకపోయింది. ఈ డాక్టరు తనని వుబ్బేసి తేరగా పుస్తకాలు పట్టు కెడుతుంటాడు.

"నా మిసెస్- మీ ఫానండి. మీ నవల

లంటే క్రేజీగా చదువుతుంది" రాక్‌లోంచి తన కొత్త నవల తెచ్చి ఇస్తున్న భర్త వంక కోపంగా చూసింది సరస్వతి.

సరస్వతికి ఎలాగో— వెలితిగా వుంది. టాబ్లెటు వేసుకుని, బోర్నవిటా తాగి కళ్ళు మూసుకుపడుకుంది. ఎంత ఆపుకుందామన్న ఏదోబాధ-వుడుకుమోత్తనం. కోపం. తన మీద తనకే కసి! తనకి తెలియకుండానే, తన ప్రమేయం లేకుండానే కనురెప్పల కిందనించి కన్నీళ్ళు చుక్కలు చుక్కలు— సన్నగా చారలుగా దిండులోకి దిగిపోతున్నాయి.

"సరూ! ఏమిటి? తలనెప్పా? కాళ్ళ నెప్పులా?" పక్కన కూచుని అడుగుతున్నాడు రామారావు.

"ఏం లేదు" అంది. కాని, చాలా వుంది మనసులో. టిష్యూ పేపర్ చుట్టిన కట్‌ఫ్లవర్స్ బొకే- గెట్‌వెల్ కార్డులు- ఎ. సి. గదిలో దర్జాగా పడుకునే ప్రాప్తి- అందరూ సానుభూతిగా చూసే యోగ్యత యివేమీ తనకి లేవు. వెధవ—బోడి ఫ్లూ అది గూడా జ్వరమేనా? ఎప్పుడూ ఇంతే కదలికలేని యీ స్తబ్ద జీవితం! అంతా బండబారిన సాదా జీవితం.

డాక్టరు అన్నట్లు సాయంత్రానికి చప్పగా చమటలు పోశాయి. జ్వరం జారిపోయింది. గ్లాస్ విత్ కేర్‌లాగా, భర్తా పిల్లలూ చెరోవయిపూ ప్రాణపదంగా పట్టుకుని తూలుతూన్న సరస్వతిని డయినింగ్ టేబుల్ ముందు కూచోబెట్టి చారూ అన్నం తినమని బలవంతం చేశారు.

ఎడం చేత్తో మంచినీళ్ళ గ్లాసు పట్టుకుని ఎత్తి తాగబోయి చెయ్యి వణికి గ్లాసు కాస్తా వదిలేసింది నీళ్ళన్నీ కింద పడ్డాయి. ఈసారి సరస్వతికి నిజంగానే ఏడుపొచ్చింది. ఏడుస్తూ నవ్వింది.

ఎందుకు నవ్విందో భర్తా పిల్లలకీ అర్థం అవలేదుగాని సరస్వతికి తెలుసు తానెందుకు నవ్వుతోందీను!

తన నవలలో హీరోయిన్ సునంద నూట అయిదు డిగ్రీల జ్వరంతో మూడు లంఖణాలు చేసి నాలుగో రోజు జ్వరంతోనే మొగుడికీ పిల్లలకీ వండిపెడుతుంది. అది ఎంత పచ్చి అబద్ధమో, ఎంత అసహజమో తనకి ఇప్పుడు అర్థం అవుతోంది. నూట రెండు డిగ్రీల జ్వరానికే డీలా పడిపోయే యీ మానవ శరీరం మూడు లంఖణాలు చేసి వంట చెయ్యగలుగుతుందా? ఊహూ! సాధ్యం కాదు. ఇలాంటి పిచ్చి పిచ్చి కథలు. ఇక మీదట తను రాయదు. రాయ కూడదు అనుకుంది సరస్వతి.

సరస్వతి కన్నీళ్ళు చూసి కంగారుపడి చిరునవ్వు చూసి స్థిమితపడిన రామారావు. "సరూ, మీ ఎడిటర్‌గారు ఫోన్ చేశారు."

"ఎందుకట?" అడిగింది చాలా నిరాసక్తతతో.

"స్పెషల్ యిష్యూకి నీ కథ కావాలిట" భార్య వంక మురిపెంగా చూస్తూ అన్నాడు రామారావు.

సరస్వతికి కిటికీ లోంచి చూస్తోంది. గాలి విసురుకి కొబ్బరి చెట్టు పూనకం వచ్చినట్లు ఇటూ అటూ వూగి స్థిమితపడి నిటారుగ్గా నిల్చుని వుంది. సరస్వతి మనసులో ఆ చెట్టు చుట్టూ కథ రూపు దిద్దుకుంటూ వుంది.

"లాభం లేదు. యీ జన్మకి నేను బాగుపడను" అనుకుంది తనలో తను సరస్వతి.


ACADEMY OF
Post Graduate Studies

Offers Coaching to students Studying Privately for

M. Com and

M. A (English/Economics/History)

Join either

* Regular Day / Evening Classes

Or

* Correspondence – cum – Contact Course.

Our Specialities : Expert Coaching, Study Material and Personal attention

Amaravathi Institute
Of Management & Services
(Affiliated to Newport University, USA)

M.B.A. Two year Full-time and Part-time Programmes

Newport University USA

DIPLOMAS (One year)
i) Financial Management. ii) Banking
iii) Personal Secretary ship iv) Education
v) Public Relations

CERTIFICATES (3 months)
i) COBOL ii) Export Management
iii) Written and Spoken English
iv) Small Industry Management.

(Co-sponsor : Indian Chamber of Commerce, Guntur)

Office Hours : 9-12 noon 2-6 P.M

3rd Floor, Dr. Y. Jaganmohan Rao Building
4/2, Arundelpet, GUNTUR-522 002

Phone : 22350

VIJAYA-GNT